


## మండల టాపర్‌కు సన్మానం

**ప్రజానావ, వేములవాడ:** పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి మండల్ టాపర్‌గా నిలిచిన వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కోడం మోర్సన్‌కు అరుదైన గౌరవం దక్కింది. ఇటీవల వెలువడిన ఫలితాలలో తన ప్రతిభతో పాఠశాలకే కాకుండా మండలానికి గుర్తింపు తెచ్చిన మోర్సన్‌ను బీసీటీఏ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలోని వివిధ మండలాలకు చెందిన టాపర్లను గౌరవించేందుకు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో లోక్‌సభ సభ్యులు డాక్టర్ మల్లు రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మోర్సన్‌కు జ్ఞాపికను అందజేసి, శాలువాతో సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి విద్యార్థులు ఇటువంటి గొప్ప విజయాలు సాధించడం అభినందనీయమని, భవిష్యత్తులో మోర్సన్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో విద్యార్థి వెంట ఉపాధ్యాయులు అబ్దుల్ సలాం పాల్గొని, మోర్సన్ సాధించిన విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మండల్ టాపర్‌గా నిలిచి, ఎంపీ చేతుల మీదుగా సన్మానం అందుకోవడం పట్ల విద్యార్థి కుటుంబ సభ్యులు, వేములవాడ పాఠశాల ఉపాధ్యాయ బృందం సంతోషం వ్యక్తం చేసింది.

## హనుమాన్ జయంతి వేడుకలకు భీమేశ్వరాలయం సిద్ధం

### భక్తుల కోసం ప్రత్యేక వేసవి సౌకర్యాలు

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి క్షేత్రంలో హనుమాన్ జయంతి వేడుకలకు సర్వం సిద్ధమైంది. జయంతి సందర్భంగా భక్తుల రద్దీ భారీగా ఉండనున్న నేపథ్యంలో, వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎండ వేడి నుండి ఉపశమనం కలిగించేందుకు ఇప్పటికే ప్రాంగణంలో భారీ ఫ్యాన్లు, క్యూలైన్లలో జంబో కూలర్లను ఏర్పాటు చేశారు. భక్తులు వేచి ఉండే చోట చలువ పందిళ్లు వేయడంతో పాటు, నిరంతరం చల్లని తాగునీరు అందించేందుకు ప్రత్యేక చలివేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. శ్రీ రాజరాజేశ్వర జల ప్రసాదం ఆధ్వర్యంలో సేవా వాలంటీర్ల సహకారంతో కూల్ బబుల్స్ ద్వారా భక్తులకు నిరంతరం తాగునీటి పంపిణీ నిర్వహిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం మహా మండపంలో ఎయిర్ కండిషనర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయగా, మూల విరాట్టు దర్శన మార్గాల్లో జంబో కూలర్ల ద్వారా చల్లని వాతావరణం కల్పిస్తున్నారు. దర్శన ఏర్పాట్లు, ప్రసాదాల పంపిణీ, తాగునీటి సదుపాయాలు సక్రమంగా ఉండేలా దేవస్థానం ప్రత్యేక చర్యలు తీసుకుంది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్య, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు మరియు జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశాల మేరకు ఆలయ ఈవో రమాదేవి స్వయంగా ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఈవో ఆదేశించారు.

## చెరువుల చెంత 'హైడ్రా' నిఘా

### కబ్జాలకు చెక్ పెట్టేలా సీసీటీవీల ఏర్పాటు

### 900 కెమెరాల నిరంతర పర్యవేక్షణ

### కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం

**ప్రజానావ, హైదరాబాద్:** నగరంలోని చెరువుల పరిరక్షణే లక్ష్యంగా హైడ్రా మరో ముందడుగు వేసింది. చెరువులను మట్టితో నింపి ఆక్రమించాలనే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్టమైన సీసీటీవీ నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గారు ఈ నూతన నిఘా వ్యవస్థను లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం 900 సీసీటీవీ కెమెరాలను వివిధ చెరువుల పరిసరాల్లో అమర్చి, వాటిని నేరుగా హైడ్రా కార్యాలయంలోని సర్వర్‌కు అనుసంధానించారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో కార్యాలయం నుంచే నిరంతరం పర్యవేక్షించే వీలు కలిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెరువుల్లో ఎవరైనా నిర్మాణ వ్యర్థాలు వేసినా, మట్టితో నింపి కబ్జాలకు ప్రయత్నించినా సీసీటీవీల ద్వారా తక్షణమే గుర్తించవచ్చని తెలిపారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కూడా ఈ కెమెరాలను అనుసంధానించినట్లు వెల్లడించారు. ఒకవేళ ఎవరైనా నిబంధనలు ఉల్లంఘించి మట్టిని తరలిస్తే, ఆ వాహనం వివరాలను వెంటనే సేకరించి అక్కడే ఉన్న లేక్ ప్రొటెక్షన్ టీమ్‌ను అప్రమత్తం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే రంగంలో ఉన్న లేక్ ప్రొటెక్షన్ టీమ్‌లకు ఈ సీసీటీవీ వ్యవస్థ అదనపు బలాన్ని ఇస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, అదనపు కమిషనర్ ఆర్. సుదర్శన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ప్రజావాణి అర్జీలకు పరిష్కారం చూపాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

### ప్రజావాణికి 165 దరఖాస్తుల రాక

**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజావాణి అర్జీలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 165 దరఖాస్తులు రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా బీరప్ప కల్యాణోత్సవం



- తంగళ్ళపల్లి మండలం లో కొనసాగుతున్న నూతన ఇందిరమ్మ గృహప్రవేశాలు
- సీఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ
- పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి

**ప్రజానావ, సిరిసిల్ల :** ఇందిరమ్మ కమిటీల కృషి ఫలితం ఈ గృహప్రవేశాలు అని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం లోని ఓగులాపూర్, లక్ష్మీపూర్, తంగళ్లపల్లి గ్రామాలలోని పలు కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జి కెకే మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. నూతన గృహప్రవేశాల కార్యక్రమం లో పాల్గొని లబ్ధిదారులకు ఆయన నూతన పట్టు వస్త్రాలు కానుకగా పెట్టి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా త్వరిత గతిన ఇండ్లు పూర్తి చేయాలనీ అధికారులకు సూచించారు. అనంతరం మండల కేంద్రం లో అంగరంగ వైభవంగా జరుగుతున్న బీరప్ప కళ్యాణం లో కెకే పాల్గొనగా గొల్ల కురుమ సంఘ పెద్దలు ఎగుర్ల కరుణాకర్, ప్రశాంత్, కుంటయ్య, రమేష్, కాంగ్రెస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికి దేవుళ్ళ దర్శనం తో ఆశీర్వాదాలు ఇప్పిస్తూ, గొంగడి తో సత్కారం చేశారు. అలాగే తశీగల్లపలి లో అనారోగ్యానికి గురైన పేద ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి సహాయ నిది నుండి లబ్ధిదారులు కొండ లత 25 వేల రూపాయలు, మంచిగట్ల లాస్య 25000, నాగాండ్ల అఖిల 25000, దావన వేణి జమ్మయ్య 12500, గుగ్గిళ్ల మల్లయ్య 60000, సెల్లా లక్ష్మి 26500 లకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ప్రవీణ్ టోనీ, మార్కెట్ కమిటీ అధ్యక్షులు వెల్ముల స్వరూప రెడ్డి, వైస్ ఛైర్మెన్ నేరల్ల నర్సింగం, సర్పంచ్ లు మోర లక్ష్మి రాజశీ, నాయిని సాయి, పర్శరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, బాలు, పరుశురాం, నాయకులు లింగాల భూపతి, ఆనందం, సుద్దాల శ్రీనివాస్, మచ్చ శ్రీనివాస్, బైరినేని రాము, శ్రీకాంత్ గౌడ్, కటకం రాజు, కొత్త రవి, మునిగల రాజు, కావటి మల్లేశం, మీరాల శ్రీను, పెద్దురు తిరుపతి, ఎడమల ప్రతాప రెడ్డి, కొత్త సంతోష్ గౌడ్, బొడ్డు పరుశురాం, గనాది కిషన్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# తార్నాక డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

### టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి

### రూ. 71 లక్షల అభివృద్ధి పనుల పరిశీలన





**ప్రజానావ, హైదరాబాద్:** తార్నాక డివిజన్ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తోందని టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోకుల్ నగర్ కాలనీలో రూ. 46.50 లక్షల వ్యయంతో చేపడుతున్న నూతన రోడ్డు నిర్మాణ పనులను, అలాగే నాగార్జున నగర్‌లో రూ. 25 లక్షలతో జరుగుతున్న మురుగునీటి కాలువల అభివృద్ధి పనులను ఆయన నిశితంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకూడదని, నిర్దేశించిన గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు. ప్రజల దైనందిన జీవితాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించేందుకు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ప్రణాళికాబద్ధంగా మెరుగుపరుస్తున్నామని తెలిపారు. తార్నాకను ఒక ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని, స్థానిక సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. కాలనీల అభివృద్ధిలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి పనులు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, టీటీయూసీ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో ప్రతి అర్హుడికి చోటుండాలి

### టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి

### తార్నాకలో ఓటర్ల నమోదు కేంద్రం పరిశీలన



**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్‌ఇన్టెన్సివ్‌రివిజన్(సర్) ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. తార్నాక డివిజన్ పరిధిలోని నాగార్జున నగర్ కమిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎంక్వైరీ మరియు సహాయ కేంద్రాన్ని సందర్శించిన ఆయన, అక్కడ జరుగుతున్న కొత్త ఓటర్ల నమోదు, పేర్ల సవరణలు, చిరునామా మార్పుల ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా, అత్యంత పారదర్శకంగా మరియు వేగవంతంగా ప్రజలకు సేవలు అందించాలని ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచించారు. అనంతరం మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, బలమైన ప్రజాస్వామ్య నిర్మాణంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా మొదటిసారి ఓటు హక్కు పొందుతున్న యువత, మహిళలు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఒక్కరూ ఒకసారి సరిచూసుకోవాలని, అవసరమైన మార్పుల కోసం నిర్లక్ష్యం చేయకుండా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పరిపాలన కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ఎన్నికల ప్రక్రియలో ప్రజలు క్రియాశీలకంగా పాల్గొనాలన్నారు. ఈ ప్రక్రియపై స్థానిక నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, టీటీయూసీ నాయకులు, కాలనీ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

